
# భవిష్యద్దర్శనం

చింతా జగన్నాధరావు




జనరల్ మేనేజర్ రాఘవ ఆ రోజు తన సీటులో కూర్చోగానే యూనియన్ ప్రతినిధి రామ్మూర్తి పదిమంది ఉద్యోగులతో రూమ్‌లోకి సుడిగాలిలా దూసుకు వచ్చాడు. అందరూ డ్యూటీ మధ్యలోంచి వచ్చారేమో తమతో బాటు ఎరువుల తయారీలో ఉపయోగించే అన్ని రసాయనాల వాసనలూ మోసుకొచ్చారు.

రాఘవకు తెరలు తెరలుగా దగ్గు వచ్చింది. అయిదు నిమిషాలకు గానీ తేరుకోలేకపోయాడు. టేబిల్ మీద ఉన్న గాజుగ్లాసులోని నీళ్లు తాగి, ఇన్‌హేలర్ పీల్చి కాస్త ఆగి అన్నాడు. ''నాకు ఈమధ్య ఆస్మా కంప్లయింట్ ఒకటి తెగ ఇబ్బంది పెట్టేస్తుందోయ్.. ఇంతకీ చెప్పండి ఏమిటింత హఠాత్తుగా ఊడిపడ్డారు?'' వేడెక్కబోయే వాతావరణాన్ని చల్లార్చడానికి సహకరించినందుకు తన అనారోగ్యానికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాడు రాఘవ.

''ఇది అన్యాయం సార్ ప్రాజెక్టు మొదటి నుంచీ ఉన్నవాళ్లం మేము. అన్ని కష్టాలూ భరించి కమిషన్ చేసింది మేము. ఉత్పత్తి పెరిగి ఇవాళ సంస్థ దేశంలోనే ప్రభుత్వ భాగస్వామ్య సంస్థలన్నింటికీ తలమానికంగా ఉందంటే మా చలవే.''

''కూల్ డౌన్ కూల్ డౌన్, ముందు తల మీద హెల్మెట్లు తీసి అందరూ కూర్చోండి. సావకాశంగా మాట్లాడుకుందాం. రాఘవ మాటలకు కాస్త శాంతించి కూర్చున్నారు అందరూ.

''ఇవాళ ఇరవై మంది కొత్త వాళ్లకి పోస్టింగ్ ఇచ్చారు. అందరూ మా పైపొజిషన్‌లలోకి తీసుకున్నారు. మేము కంపెనీలో చేరేటప్పుడు మాకు మీరు హామీ ఇచ్చిందేమిటి ఒకసారి ఉత్పత్తి గాడీలో పడగానే మీద వేకెన్సీలు మీతోనే భర్తీ చేస్తామని. ఇప్పుడేమో ఇలా.. ఏరు దాటి తెప్ప తగలేసినట్టు'' రామ్మూర్తి తన ఉక్రోషం అంతా వెళ్లగక్కాడు.

రాఘవ ఆరు నెలల క్రితమే ఈ పరిస్థితి ఊహించాడు. కార్పొరేటు ఆఫీసు నుండి ఈ ప్రతిపాదన రాగానే తన శాయశక్తులా అడ్డుకోవటానికి ప్రయత్నించాడు గానీ లాభం లేకపోయింది. అక్కడ రాజ్యమేలుతున్నది ఫ్యాక్టరీ వర్గాలంటే చిన్నచూపు ఉండే వాళ్ల హవా, అదీకాక పాలనా విషయాల్లో సంస్థది సిసలైన ప్రైవేటు ధోరణి. అధిపతులదే ఇష్టారాజ్యం. ఏది ఏమైనప్పటికీ తనకు తప్పదు వీళ్లని మేనేజ్ చేయాలి. లేకపోతే వచ్చే ఇబ్బందులు క్లిష్టంగా ఉంటాయి అనుకున్నాడు రాఘవ.

''మీరందరూ డిప్లమో హోల్డర్లు, డిగ్రీ హోల్డర్లు అవునా?''

తలలూపారు ఉద్యోగులు.

''అనుభవజ్ఞులు, మొదటి నుంచీ ఇక్కడ ఉన్న వాళ్లు గనుక నిజానికి మిమ్మల్ని ప్రమోట్ చేయాలి యాజమాన్యం..''

జి.ఎమ్. తమ దారిలోకి వస్తున్నట్లు అనిపించింది ఉద్యోగులకు.

''అయితే... మీకు తెలియందేముంది ఇవాళ ప్రపంచమంతా పోటీ వాతావరణం గ్లోబలైజేషన్ నేపథ్యంలో సంస్థ ముందుకు వెళ్లాలంటే కొన్ని నిర్ణయాలు తీసుకోక తప్పదు. విజన్ 2020తో యాజమాన్యం ఓ ప్రత్యేకమైన ప్రయోజనం కోసం ఈ రిక్రూట్‌మెంట్ చేసింది. కొత్తవాళ్లంతా నవతరం ఇంజనీర్లు, మాస్టర్ డిగ్రీలు ఉన్నవాళ్లు. ప్రముఖ బిజినెస్ స్కూళ్లలో చదివిన వాళ్లు. కంప్యూటర్ నైపుణ్యాలు, సాఫ్ట్ స్కిల్స్ ఒకటేమిటి అన్నీ అధికం. నెమ్మదిగా యాజమాన్యపు విధానం బయటపెట్టాడు రాఘవ.

''మీరు చెప్పింది మేం నమ్మాలన్న మాట. ఎందుకు సార్ నయవంచన! వడ్డించిన విస్తరి భోంచేయడానికి అస్మదీయుల్ని తస్మదీయుల్ని సిద్ధం చేశారు అంతేగా...'' వెటకారంగా అన్నాడు రామ్మూర్తి.

కాస్త వాస్తవిక ధోరణితో ఆలోచించండి మీకు అనుభవం ఉంది కాదనలేం. అయితే అర్హతల విషయానికి వస్తే వాళ్లదే పైచేయి.. ఇవే వేకన్సీలకు మీరే దరఖాస్తు చేశారు అనుకోండి మీ గురించి ఏం రాసుకుంటారు. ఒకటి రెండు పాయింట్లు.. ఫలానా డిప్లమో లేక ఫలానా డిగ్రీ.. సి ఎండ్ జె కంపెనీలో వర్క్ చేశాం అంతే గాక వివరాలు ఏమాత్రం ఆసక్తికరంగా చెప్పలేరు.... అదే వాళ్లయితే అర్హతలు, ట్రైనింగ్‌ల గురించే ఐదు పేజీలు నింపగలరు. కావల్సిన దాని మీద ఓ అరగంట లెక్చరు ఇవ్వగలరు. సమస్య మీద గ్రూప్ డిస్కషన్స్ చేయగలరు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వగలరు. వాటిలో అసలు ప్రవేశమైనా ఉందా మీకు?.. ప్రశ్నించాడు రాఘవ.

అయినా మీరు మరీ ఇంత గాభరా పడనవసరం లేదు. వెన్నెముక మీరేనయ్యా ఈ కంపెనీకి. యాజమాన్యం మిమ్మల్ని నిర్లక్ష్యం చేయడానికి లేదు. మీకూ అవకాశాలు వస్తాయి. ఈసారి చేసే రిక్రూట్‌మెంట్‌లో యాజమాన్యం తప్పక మిమ్మల్ని పరిగణిస్తుంది. వీళ్లను తెచ్చింది 'జస్ట్ విండో డ్రెస్సింగ్'కే అనుకోండి. నేను పర్సనల్‌గా కృషి చేస్తాగా. వచ్చే ఏడాది మీకు తప్పకుండా ప్రమోషన్లు వచ్చేటట్లు చూస్తాను. కాస్త ఓపిక పట్టండి'' జి.ఎమ్. సన్నాయినొక్కులు అప్పటికి పబ్బం గడుపుకోవడానికేనని రామ్మూర్తి అతని బృందానికి తెలుస్తూనే ఉంది. ఆయన వాక్చాతుర్యం ముందు తమని కుప్పిగంతులని. ఈ విషయమై యాజమాన్యం వెనక్కు వెళ్లే ప్రసక్తే లేదని అర్థమైంది.

రాఘవ ప్రొడక్షన్ మీటింగ్‌కి వెళ్లాల్సిన సమయమవ్వడంతో సమావేశం అర్ధంతరంగా ముగిసింది. బృందం అసంతృప్తితోనే బయటకి వచ్చింది. భవిష్యత్ కార్యాచరణకి ప్రణాళిక సిద్ధం అయింది.

★ ★ ★


''వస్తున్నారురోయ్! మన విజన్ ట్వంటీ ట్వంటీ హీరోస్ స్వాగతం చెప్పాలిరోయ్'' కంట్రోల్ రూమ్‌లో తోటి ఉద్యోగులని హెచ్చరించాడు రామ్మూర్తి.

కొత్త ఆఫీసర్లకి మొదటిరోజే వెటకారాలు చీదరింపులు.

''ఏం బాబూ వచ్చావా.. ఎవరి రికమెండేషన్.. మంత్రిగారా లేక ఎమ్.పి.యా.. ఒకవేళ ఏ ఐ.ఎ.ఎస్. పుత్రరత్నానివా లేక కాబోయే అల్లుడివా''

''ఎర్రగా బుర్రగా ఉన్నావు. ఎందుకబ్బాయ్ నీకీ ఫ్యాక్టరీ ఉద్యోగం. మా అవకాశాలు కొల్లగొట్టడానికి కాక పోతే, చూడు మూడు రోజుల్లో ఎంత కమిలిపోయావో!''

''ఇది ఫ్యాక్టరీ. అయినా మీకెందుకయ్యా ఈ ఖర్మ! వేడిలో కలుషిత వాతావరణంలో పనిచే



యడం. ఇంతకన్నా మంచి ఉద్యోగాలు వెతుక్కోండి పోయి. మీ డాడీలకు, గాడ్‌ఫాదర్‌లకు పలుకుబడికి లోటేం లేదు కదా''

దత్తపుత్రులు పట్టువదలని విక్రమార్కుల్లా ప్లాంటులోనే రోజూ క్షేత్ర పర్యటనలు చేస్తున్నారు. కంట్రోలు రూంలోని మేన్యుయల్‌లు, డ్రాయింగులు అధ్యయనం చేస్తున్నారు. యంత్రాల వద్దకు వెళ్లి పనిచేసే విధానం పరిశీలిస్తున్నారు. నోట్సు రాసుకుంటున్నారు.. ప్లాంటులో జరుగుతున్న సహాయ నిరాకరణ వాళ్ల మీద ఏ మాత్రం ప్రభావాన్ని చూపించటం లేదు.

ఆందోళన మరింత ఉధృతం చేశారు. ఉత్పత్తి విభాగపు ఉద్యోగులు. నల్లబేడ్జీలు, నినాదాలు, ఘెరావ్‌లు..

అన్ని వార్తలు కార్పొరేటు ఆఫీసుకు చేరుతూనే ఉన్నాయి. మానవవనరుల శాఖలో కావల్సినంత హడావుడి. ఈ మిషతో ఫ్యాక్టరీకి, కార్పొరేటు ఆఫీసుకి మధ్య మందీమార్బలాలతో అటూ ఇటూ ఉన్నతాధికారుల పర్యనటలు. ఒకరిని మించి ఒకరు తమ తమ శక్తి సామర్థ్యాలని నిరూపించుకునే ప్రయత్నంలో ఉన్నారు. అంతర్లీనంగా అందరి లక్ష్యం ఒక్కటే. అతి తక్కువ సమయంలో పూర్తిస్థాయి ఉత్పత్తిని సాధించిన ఉత్పత్తి విభాగపు ప్రాముఖ్యతను తగ్గించడం.. ఇలాంటి అవకాశం మళ్లీ ఎప్పుడో గానీ రాదు. సంస్థని మొదటి సంవత్సరంలోనే లాభాల బాట పట్టించడంలో ముఖ్య పాత్ర ఫ్యాక్టరీ వర్గాల అంకిత భావం అన్నది వారు అంగీకరించలేని నిజం. అన్నిటి కంటే తమ నిర్వహణా సామర్థ్యమే సంస్థ ఉన్నతికి ముఖ్య కారణం వారి నమ్మకం.

★ ★ ★

రాఘవకి ఏమీ పాలుపోవటం లేదు. ఉద్యోగులతో సత్సంబంధాలు సంస్థ అభివృద్ధికి దీర్ఘకాలంలో దోహదపడతాయని తన ముప్ఫై ఏళ్ల అనుభవంలో గాఢంగా ఏర్పర్చుకున్న విశ్వాసం. ప్రపంచీకరణతో దిగుమతి అయిన విధానాలు మానవ వనరుల వినియోగంలో కొత్త కొత్త భాష్యాలు ప్రవేశించి పరిస్థితిని ఎక్కడకు తీసుకువెళ్తాయో తెలియని అయోమయం. సమస్యని పరిష్కరించడానికి తన వంతు కృషి చేయడానికి నిర్ణయించుకు



న్నాడు.

ఉన్నతస్థాయి సమావేశంలో నిర్మొహమాటంగా హెచ్చరించాడు రాఘవ. ''నాలుగు రోజుల్లో అంతా సద్దుమణుగుతుంది. ఆవేశాలు కొన్నాళ్లే. ఉద్యోగులు సమ్మె వరకూ వెళ్లే ప్రసక్తే లేదని, అందుకు కారణం ఫ్యాక్టరీ అంతా అత్యాధునికమైన కంట్రోల్లు. స్టార్ట్ చేయడానికి. షట్ డౌన్ చేయడంలో మాత్రమే మానవ ప్రమేయం ఉంటుంది. అంచేత కనీసం స్లోడౌన్‌కీ కూడా అవకాశం లేదు. ప్రొడక్టుని సంచుల్లో నింపే బేగింగ్ ప్లాంటులో అది వీలుపడుతుంది గానీ అక్కడ ఉన్నది కాంట్రాక్టు కార్మికులు. వీళ్లతో కలసిరారు. అని. అందుచేత ఉద్యోగుల మీద ప్రతీకార చర్యలు అనవసరం''


మేనేజింగు డైరెక్టరుగారు ఏకళనున్నారో గానీ రాఘవ మాటలు విన్నారు. అతను ఇచ్చిన సూచన కూడా అంగీకరించారు.

★ ★ ★

''మీరందరూ కాబోయే మేనేజర్లు, జనరల్ మేనేజర్లు, మీకిస్తున్న జీతాలు, సౌకర్యాలు ఈ పరిశ్రమలోనే అత్యుత్తమం. ప్లాంటులో పరిస్థితికి మీరేం భయపడనక్కరలేదు. యాజమాన్యం మీ వెంటే ఉంటుంది. ధైర్యం చెప్పాడు రాఘవ కొత్త ఆఫీసర్లకి. పనిచేసే వర్గాలు ఎప్పుడూ ఏదో ఒక అసంతృప్తితోనే ఉంటాయి. మొన్న మొన్న జీతాల్లో ఇరవై శాతం పెంపు ఇచ్చాం. బోనస్‌లు ఇచ్చాము. అయినా ఈ నెపంతో ఆందోళనకి దిగాయి. ఇదీ ఒకందుకు మంచిదే కార్మికవర్గాల మనస్తత్వాలు ఎలా ఉంటాయో మీకు అనుభవంలోకి వస్తున్నాయి. అవును కదూ.

ఇంతకీ మీకో గుడ్ న్యూస్ చెప్పాలి. మీకు యాజమాన్యం ఓ గ్రాండ్ టూర్ ఏర్పాటు చేసింది. పేరుకు పరిశ్రమలోని అన్ని ఫ్యాక్టరీలు పర్యటించడం కోసం. నిజానికిది ఓ రెండు నెలల విహారయాత్ర. ఫ్లయిట్‌లు, ఫైవ్‌స్టార్ హోటళ్లలో బసలు. అన్ని ఖర్చుల్నీ యాజమాన్యం భరిస్తుంది. వెంట శ్రీమతుల్ని, లేకపోతే గర్ల్ ఫ్రెండుల్ని తీసుకువెళ్లవచ్చు'' తన జోకుకి తనే గలగలా నవ్వాడు రాఘవ.

★ ★ ★




''ఏం బాబులూ జాలీ ట్రిప్పులకి కూడా వెళ్తున్నారంట. మొత్తం మీద అత్తారిల్లు అయిందన్న మాట మా కంపెనీ. ఇక్కడే సెటిల్ అయిపోతారన్న మాట''

''మేము సెటిల్ అయిపోతామని ఎవరు అన్నారు ఉండేది మేగ్జిమమ్ ఆరు నెలలు లేదా ఏడాది. తరువాత కాస్త ముందు వెనుకగా ఒకరొకరం అందరం ఇతర కంపెనీలకు జంప్ అయిపోమా'' ఫెళ్లున నవ్వాడు నితీష్. బేచ్‌లో అందరి కన్నా చిన్నవాడు అతను. ''మేము జాయిన్ అయ్యింది మీ కంపెనీని ఉద్ధరించడానికి కాదు.. మీ ప్రమోషన్లకి అడ్డం పడడానికి కాదు''

''మరి?''

''కేవలం ఫలానా కంపెనీలో కూడా పనిచేశానని చెప్పుకోడానికే. మా రిస్యూమ్‌లో కొత్త పాయింట్లు చేర్చడానికి.. మాది విజన్ ట్వెంటీ టెన్ మాత్రమే!''

○

## ప్చ్! శిల్పాశెట్టి!!

లండన్‌లో బోల్డు బిజినెస్‌లు చేసే భారతీయుడు రాజ్ కుంద్రాని గత ఏడాది పెళ్లి చేసుకున్న పొడుగుకాళ్ల బాలీవుడ్ సుందరి శిల్పాశెట్టి తన మొదటి వెడ్డింగ్ యానివర్సరీని నవంబర్ 22న ఎంతో ఘనంగా జరుపుకోవాలని తెగ ఉబలాటపడింది. కానీ అనారోగ్యం ఆమెని నిరాశలో ముంచేసిందిట. పెళ్లిరోజు సందర్భంగా అద్భుతమైన పార్టీని ఏర్పాటు చేసి మిత్రులు, ముఖ్య అతిథులతో ఆనందంగా గడపాలని భావించిన ఆమెకి త్రోట్ ఇన్ఫెక్షన్ వచ్చి తెగ బాధపడిందిట. వచ్చే ఏడాదైనా పెళ్లిరోజుని మరింత ఘనంగా చేసుకోవాలని ఇప్పట్నించే భావిస్తోందిట.

